చంద్రయాన్ సక్సెస్‌తో బిలియనీర్ల జాబితాలోకి!

ఫోర్బ్స్ జాబితాలో కేనస్ టెక్నాలజీ ఎండీ రమేశ్ కున్హికన్నన్

బెంగళూరు, ఏప్రిల్ 4: చంద్రయాన్-3 సక్సెస్ ఎంతోమంది జీవితాల్ని మార్చింది. ఈ ప్రాజెక్ట్‌లో పాల్గొన్నవారికి అంతర్జాతీయంగా గుర్తింపు దక్కింది. అలాగే చంద్రయాన్-3 సక్సెస్ తర్వాత మైసూర్‌కు చెందిన కేనస్ టెక్నాలజీ ఎండీ రమేశ్ కున్హికన్నన్ (60) 'ఫోర్బ్స్ బిలియనీర్స్-2024' జాబితాలో చోటుదక్కించుకున్నారు. 1.2 బిలియన్ డాలర్ల (సుమారుగా రూ.10వేల కోట్లు) సంపదతో ఆయన తొలిసారిగా ఈ రికార్డ్‌ను అందుకున్నారు. చంద్రయాన్-3 ప్రాజెక్ట్‌కు అత్యంత కీలకమైన ఎల్వక్టికల్ పరికరాలు, ల్యాండర్, రోవర్‌లకు విద్యుత్ సరఫరా వ్యవస్థలను అందించింది ఆయన సంస్థే. చంద్రయాన్-3 సక్సెస్ తర్వాత టెక్నాలజీ రంగంలో ఆయన పేరు మారుమోగింది. కేనస్ టెక్నాలజీ షేర్ వాల్యూ నిరంతరం పెరుగుతూ వస్తుండటంతో, కంపెనీలో 64 శాతం వాటా కలిగిన ఆయన సంపద అనూహ్యంగా పెరిగింది.

ట్రిపుల్ఆర్‌పై నీలినీడలు!

- అలైన్‌మెంట్ సవరణపై కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి
- రాయగిరి ప్రాంత రైతుల వ్యతిరేకతే ఇందుకు కారణం
- కేంద్రం తలొగ్గితే మరింత విమర్శ
- దక్షిణ భాగం పనులపైనా మరింత ప్రతికూల ప్రభావం పడే చాన్స్
- తేనెతుట్టెను కదిపినట్టేనంటున్న శాఖల ఉన్నతాధికారులు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ఆర్) నిర్మాణంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి ప్రాంతంలో ఈ రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తూ కొందరు రైతులు కోర్టును ఆశ్రయించడంతో ఈ అంశాన్ని పరిశీలించాలని ఇటీవల ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో కోర్టు సూచనల మేరకు అలైన్‌మెంట్‌ను మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. ట్రిపుల్ఆర్ ఉత్తర భాగం నిర్మాణ పనుల కోసం త్వరలో టెండర్లు పిలిచేందుకు జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) సిద్ధమవుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదన చేయడం గమనార్హం. దీనిపై ఎన్‌హెచ్ఏఐ సానుకూల నిర్ణయం తీసుకుంటే ఈ ప్రాజెక్టు మరింత ఆలస్యమయ్యే అవకాశాలున్నాయి. భారత్‌మాల పరియోజన తొలి దశలో భాగంగా ట్రిపుల్ఆర్‌లో 164 కి.మీ. పొడవైన ఉత్తర భాగాన్ని నిర్మించాల్సి ఉన్నది. ఇందుకు అవసరమైన 1,935.35 హెక్టార్లలో ఇప్పటికే 1,500 హెక్టార్ల (85 శాతం) భూసేకరణ పూర్తయింది. మిగిలిన 15% భూసేకరణ ప్రక్రియను 3 నెలల్లో పూర్తిచేయాలని నిర్ణయించారు. కానీ, ట్రిపుల్ఆర్‌కు సంబంధించిన డీపీఆర్ తయారైనప్పటి నుంచే రాయగిరి ప్రాంత రైతులు దీనికి వ్యతిరేకంగా ఆందోళన నిర్వహిస్తున్నారు. దీనిపై అప్పుడు స్థానిక ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా రైతులకు మద్దతుగా నిలిచారు. ప్రస్తుతం ఆయనే రాష్ట్ర ఆర్ అండ్‌బీ మంత్రిగా ఉండటంతో ట్రిపుల్ఆర్ అలైన్‌మెంట్‌ను సవరించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

టెండర్ల ప్రక్రియకు బ్రేకులు?

ట్రిపుల్ఆర్ అలైన్‌మెంట్ ఇప్పటికే ఖరారైనందున దాన్ని సవరించేందుకు అంతగా ఆస్కారం ఉండకపోవచ్చని అధికారులు అంటున్నారు. కానీ, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు ఎన్‌హెచ్ఏఐ అంగీకరిస్తే తేనెతుట్టెను కదిపినట్టేనని, అలైన్‌మెంట్‌లో మార్పులు చేస్తే మరికొన్ని కొత్త డిమాండ్లు రావొచ్చని, రాయగిరి ప్రాంత రైతుల మాదిరిగా మిగిలిన చోట్ల కూడా వ్యతిరేకత వ్యక్తం కావొచ్చని అధికారులు చెప్తున్నారు. ఇదే జరిగితే ట్రిపుల్ఆర్ దక్షిణ భాగం పనులపై కూడా ప్రభావం పడుతుందని, దీంతో ఈ ప్రాజెక్టు మరింత జాప్యమవడం ఖాయమని హెచ్చరిస్తున్నారు. కానీ, ట్రిపుల్ఆర్ అలైన్‌మెంట్ మార్పునకు సాక్షాత్తూ రాష్ట్ర ఆర్అండ్‌బీ మంత్రే మద్దతు తెలపడంతో టెండర్ల ప్రక్రియకు బ్రేకులు పడినట్టేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను కాదని కేంద్రం ముందుకెళ్తే ముమ్ముందు ఈ ప్రాజక్టు నిర్మాణంలో మరిన్ని సమస్యలు తలెత్తవచ్చని ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెప్తున్నారు.

అనేక పట్టణాల గుండా ట్రిపుల్ఆర్

ట్రిపుల్ఆర్ నిర్మాణానికి మొత్తంగా దాదాపు 4,942 ఎకరాల భూములను సేకరించాల్సి ఉన్నది. దీనికి రూ.5,170 కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనా. ఇందులో సగ భాగాన్ని (రూ.2,585 కోట్లు) రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉన్నది. మిగిలిన సగ భాగంతోపాటు యుటిలిటీస్ షిఫ్టింగ్‌కు అయ్యే రూ.363 కోట్ల ఖర్చును భరించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. ట్రిపుల్ఆర్ నిర్మాణాన్ని రెండు భాగాలుగా చేపట్టనున్నారు. ఇందులో 164 కి.మీ. పొడవైన ఉత్తర భాగాన్ని రూ.9,500 కోట్లతో నిర్మించాలని నిశ్చయించారు. ఈ భాగం సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, యాదాద్రి, ప్రజ్ఞాపూర్, భువనగిరి, చౌటుప్పల్ తదితర పట్టణాలమీదుగా సాగుతుంది. 182 కి.మీ. పొడవైన దక్షిణ భాగాన్ని రూ.6480 కోట్లతో నిర్మించనున్నారు. ఇది చౌటుప్పల్, ఇబ్రహీంపట్నం, కందుకూరు, ఆమన్‌గల్, చేవెళ్ల, శంకర్‌పల్లి, సంగారెడ్డి తదితర పట్టణాల మీదుగా సాగుతుంది.

విద్యా - ఉద్యోగ సమాచారం

టీఎస్ ఎప్‌సెట్‌కు 3.21 లక్షల దరఖాస్తులు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ):టీఎస్ ఎప్‌సెట్ (ఇంజినీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ)కు 3,21,604 దరఖాస్తులు వచ్చినట్టు గురువారం సెట్ కన్వీనర్ తెలిపారు. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి 2,33,517, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 87,819 దరఖాస్తులు, రెండు విభాగాలకు కలిపి 268 దరఖాస్తులు నమోదైనట్టు వివరించారు. ఆలస్య రుసుము లేకుండా ఈ నెల 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నిరుడుతో పోల్చితే ఈసారి ఎప్‌సెట్ దరఖాస్తుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నదని పేర్కొన్నారు. గత ఏడాదిలో గరిష్ఠంగా ఇంజినీరింగ్, అగ్రికల్చర్ విభాగాలకు కలిపి 3,20,683 దరఖాస్తులు నమోదైనట్టు తెలిపారు.

టీఎస్ సెట్ సభ్య కార్యదర్శిగా జీ నరేశ్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ స్టేట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీఎస్ సెట్) సభ్య కార్యదర్శిగా ప్రొఫెసర్ జీ నరేశ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఓయూ వీసీ డీ రవీందర్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి ఓయూలో వాణిజ్య విభాగంలో విశిష్ట ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. టీఎస్-సెట్‌కు సమన్వయకర్తగా పని చేశారు.

సీడీఎఫ్‌డీలో పీహెచ్‌డీ ప్రవేశాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 4(నమస్తే తెలంగాణ) : పీహెచ్‌డీలో ప్రవేశాలకు అర్హులైన వారు ఈ నెల 24వరకు దరఖాస్తు చేసుకోవాలని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ (సీడీఎఫ్‌డీ) తెలిపింది. సెల్ అండ్ మాలిక్యూలార్ బయాలజీ, జెనిటిక్స్ , ఏపీజెనిటిక్స్, ట్రాన్స్‌క్రిప్షన్ అండ్ క్రోమాటిన్ బయాలజీ, కంప్యూటేషనల్ బయాలజీ, మాలిక్యూలార్ మైక్రోబయాలజీ, డిసీజ్ ఇన్‌ఫెక్షన్ బయాలజీ, న్యూరోబయాలజీ, ఇమ్యూనోలాజీ వంటి రంగాల్లో పరిశోధనలకు అవకాశం ఉన్నదని వివరించింది. వివరాలకు http://14.139.82.220/apps/rep-2-2024/ లింక్ లేదా సీడీఎఫ్‌డీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

7న మాడల్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని మాడల్ స్కూళ్లలో ఆరో తరగతి నుంచి పదోతరగతిలో ప్రవేశాలకు ఈ నెల 7న పరీక్ష నిర్వహించనున్నట్టు మాడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 6వ తరగతి, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు 6 నుంచి10 తరగతులలో ప్రవేశాలకు పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. తెలంగాణ మాడల్ స్కూల్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షలకు మొత్తం 62,983 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు తెలిపారు. వివరాలకు "telanganams.cgg.gov.in" వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

టెన్త్ స్పాట్‌కు 9, 11 తేదీల్లో సెలవులు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : ఉగాది సందర్భంగా టెన్త్ స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాలకు రెండు రోజులు సెలవులు ప్రకటిస్తూ ప్రభుత్వ పరీక్షల విభాగం నిర్ణయం తీసుకొన్నది. ఈ నెల 9న ఉగాది, 11న రంజాన్ నేపథ్యంలో ఈ రెండు రోజులు సెలవులు ప్రకటించినట్టు పేర్కొన్నది.

వెబ్‌సైట్‌లో ఏఈ పరీక్షల తుది కీ

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్, టెక్నికల్ ఆఫీసర్స్ అండ్ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి నిరుడు అక్టోబర్ 18, 19న నిర్వహించిన రాత పరీక్షల తుది 'కీ'ని విడుదల చేసినట్టు గురువారం టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఫైనల్ కీ, రెస్పాన్స్ షీట్లు అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ నవీన్ నికోలస్ తెలిపారు.

జేఈఈ గణితం పేపర్ కొద్దిగా కఠినం

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : దేశ వ్యాప్తంగా జేఈఈ మెయిన్-2 పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు జరగ్గా, గణితం పేపర్ కొద్దిగా కఠినంగా వచ్చింది. గణితం సబ్జెక్టు పరీక్షలలో వచ్చిన ప్రశ్నలు చాలా సుదీర్ఘంగా ఉన్నాయని విద్యార్థులతో పాటు నిపుణులు అభిప్రాయపడ్డారు. జేఈఈ పరీక్షల ప్రశ్నపత్రాల విషయంలో విద్యార్థులలో మిశ్రమ స్పందన వచ్చింది. విద్యార్థులు కొంతవరకు ఉపశమనం పొందారు. కెమిస్ట్రీలో కొంచెం మోస్తరు ప్రశ్నలు రాగా, ఫిజిక్స్‌లో ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్ పరిధి దాటకుండా ప్రశ్నలు వచ్చినట్టు విద్యార్థులు, నిపుణులు అభిప్రాయపడ్డారు. ఫిజిక్స్, కెమిస్ట్రీపైనా దృష్టి పెట్టిన విద్యార్థులకు మంచి మార్కులు రావడంతో పాటు మంచి పర్సంటైల్ కూడా వచ్చే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు.

కేంద్రీయ వర్సిటీలలో సీబీసీ ఏర్పాటు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : దేశంలోని వివిధ వివిధ ప్రభుత్వ ఉద్యోగులలో సామర్థ్యాలు, సమన్వయాన్ని మెరుగుపరిచేందుకు కేంద్రం కెపాసిటీ బిల్డింగ్ కమిషన్‌ను (సీబీసీ) ఏర్పాటు చేసింది. పర్సనల్ అండ్ ట్రైనింగ్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో 'మిషిన్ కర్మయోగి'లో భాగంగా 45 కేంద్రీయ యూనివర్సిటీలలో బోధనేతర సిబ్బంది సామర్థ్యం పెంపుకోసం సీబీసీ ఈ శిక్షణ ప్రారంభించినట్టు యూజీసీ చైర్మన్ డాక్టర్ మామిడాల జగదీశ్‌కుమార్ తెలిపారు.

సమ్మేటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు వాయిదా

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు నిర్వహించే సమ్మేటివ్ అసెస్‌మెంట్(ఎస్ఏ)-2 పరీక్షలు వాయిదావేస్తూ పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. పరీక్షలను ఈ నెల 15 నుంచి 22 వరకు నిర్వహించాలని కొత్తగా మరోసారి షెడ్యూల్ విడుదల చేసింది. పాత షెడ్యూల్ ప్రకారం ఈ నెల 8 నుంచి 20 వరకు పరీక్షలు నిర్వహించాల్సి ఉన్నది. ఈ రోజుల్లో రంజాన్, ఉగాది పడుగలు ఉన్నందున పరీక్షలు వాయిదా వేయాలని ఎంఐఎం పార్టీ ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్ఏ-2 పరీక్షలు వాయిదా వేస్తున్నట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ పరీక్షల ఫలితాలను ఈ నెల 23న విడుదల చేస్తామని పేర్కొన్నారు.

టెట్‌కు 85,412 దరఖాస్తులు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : టీఎస్ టెట్‌కు 85,512 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రం నాటికి టెట్ పేపర్-1కు 34,174, పేపర్-2కు 51,238 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకొన్నట్టు వెల్లడించారు.

వద్దిరాజు రవిచంద్రతో రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం చేయిస్తున్న జగదీప్ ధన్కర్

రాజ్యసభ సభ్యుడిగా వద్దిరాజు ప్రమాణం

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన రవిచంద్ర

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): రాజ్యసభ సభ్యుడిగా వద్దిరాజు రవిచంద్ర గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్.. వద్దిరాజుచే ప్రమాణం చేయించారు. ఎంపీగా రెండోసారి వద్దిరాజు తెలుగులో దైవసాక్షిగా ప్రమాణం చేయటం గమనార్హం. పార్లమెంట్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ వైస్‌చైర్మన్ హరివంశ్ నారాయణ సింగ్, రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీకే మోదీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి పీయూష్ గోయల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వద్దిరాజుకు పలువురు ఎంపీలు శుభాకాంక్షలు తెలిపారు. తనపై విశ్వాసంతో రెండోసారి రాజ్యసభకు పంపిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు వద్దిరాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణే పరమావధిగా పనిచేస్తానని వద్దిరాజు పేర్కొన్నారు.

క్రిసెంట్‌కు జీఐ సర్టిఫికెట్ ప్రదానం

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌కు చెందిన క్రిసెంట్ హస్తకళా కళాకారుల సంక్షేమ సంఘానికి భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఇండికేషన్-జీఐ) సర్టిఫికెట్ అందజేశారు. గురువారం సచివాలయంలో ప్రత్యేక ప్రధానకార్యదర్శి జయేశ్ రంజన్ సమక్షంలో సంఘం అధ్యక్షుడు హిసాబుద్దీన్‌కు జీఐ సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జియోగ్రాఫికల్ రిజిస్ట్రీ విభాగం ఇటీవలే హైదరాబాద్ లాడ్‌బజార్‌లోని లక్క గాజులకు జీఐ గుర్తింపును ప్రకటించింది. ఇకమీదట లాడ్‌బజార్ లక్క గాజులు జీఐ బ్రాండింగ్‌తో విక్రయించేందుకు వీలు కలుగుతుంది. ఫలితంగా వీటికి ప్రపంచవ్యాప్తంగా మరింత ప్రాచుర్యం లభించే అవకాశం ఉన్నది.

కవిత బెయిల్‌పై 8న తీర్పు

- ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వు
- షరతులతో కూడిన బెయిల్ ఇవ్వండి
- పరీక్షల వేళ కుమారుడికి తల్లి అవసరం
- కోర్టులో అభిషేక్ సింఘ్వీ వాదనలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై విచారణ ముగిసింది. న్యాయస్థానం సోమవారం తన నిర్ణయాన్ని వెల్లడించనుంది. కుమారుడి పరీక్షల నేపథ్యంలో తనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కవిత కోరిన విషయం తెల్సిందే. దీనిపై గురువారం వాదనలు జరిగాయి. ఈడీ కస్టడీ ముగిసినందున రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలని కవిత తరపు న్యాయవాదులు మరో పిటిషన్ కూడా దాఖలు చేశారు. కవిత తరపున ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. ఆమ్ ఆద్మీ పార్టీ నేత సంజయ్ సింగ్ బెయిల్‌కు సంబంధించిన తీర్పును ప్రస్తావించారు. కవితకు మధ్యంతర బెయిల్ ఇవ్వవచ్చని, న్యాయస్థానం ఏ షరతులు పెట్టినా.. వాటిని అమలు చేసేందుకు కవిత సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తల్లిగా తన కుమారుడికి పరీక్షలు ఉన్నపుడు దగ్గర ఉండటం కవితకు అత్యవసరమని, పరీక్షల సందర్భంగా తల్లిగా నైతిక మద్దతు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. పరీక్షలు, విద్యార్థుల సన్నద్ధత గురించి ప్రధాని మోదీ కూడా అనేక సందర్భాల్లో చెప్పారని, తల్లి మద్దతు పిల్లలకు ఉండాలని అన్నారు.

తల్లి అరెస్టు కవిత కుమారుడిపై పడే ప్రమాదం ఉన్నదని, పరీక్షలు వంటి కీలక సమయంలో తల్లి సపోర్టు బిడ్డకు అవసరమని చెప్పారు. కవిత భర్త న్యాయపోరాటంలో ఉన్నారని, ఆయన తన కుమారుడిపై పూర్తిగా దృష్టిసారించలేకపోతున్నారని అన్నారు. మహిళగా, తల్లిగా కవితకు బెయిల్ ఇవ్వవచ్చని చెప్పారు. ఏప్రిల్ 16 వరకు కవిత కుమారుడికి పరీక్షలు ఉన్నాయని తెలుపుతూ పరీక్షల షెడ్యూల్ వివరాలను కోర్టుకు అందజేశారు. కవిత అరెస్టుతో కుమారుడు కుంగుబాటుకు గురవుతున్నాడని, ఆ బాలుడు పరీక్షలకు గైర్హాజరయ్యే ప్రమాదం ఉన్నదని చెప్పారు. తల్లి పాత్రను తండ్రి పూర్తిగా భర్తీ చేయలేరన్నారు. గతంలో న్యాయస్థానాలు వివిధ సందర్భాల్లో మహిళలకు బెయిల్ ఇచ్చిన సందర్భాలను ఈ సందర్భంగా కోర్టు ముందుంచారు. ప్రీతి చందా, సౌమ్యచౌరాసియా తదితర కేసుల గురించి వివరించారు. ఆయా కేసుల్లో న్యాయస్థానాలు బెయిల్ ఇచ్చాయని చెప్పారు. కల్వకుంట్ల కవితకు కూడా షరతులతో కూడిన బెయిల్ ఇవ్వాలని కోరారు.

దినేశ్ అరోరా ఇచ్చిన సమాచారంతో విచారణ చేస్తున్నాం: ఈడీ

ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించి గతంలోనే తాము దినేశ్ అరోరాను అదుపులోకి తీసుకున్నామని, ఆయన ఈ కేసులో అప్రూవర్‌గా మారారని ఈడీ న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చింది. ఈడీ తరపున జోయబ్ హుస్సేన్ వాదనలు వినిపిస్తూ.. అప్రూవర్‌గా మారిన తర్వాత దినేశ్ అరోరా అనేక విషయాలు చెప్పారని, రూ.100 కోట్లు కవిత ఆలోచనల మేరకే ఆమ్ ఆద్మీ పార్టీకి ముడుపుల రూపంలో ఇచ్చారని తెలిపారు. ఆడిటర్ బుచ్చిబాబు ఫోన్‌డాటాను కూడా రికవరీ చేశామని, ఆ డాటా ప్రకారం కవితను విచారించామని చెప్పారు. ఈ కేసులోనే ప్రధాన పాత్రపోషించిన అరుణ్‌పిళ్లైతో కలిపి కవితను విచారించామని తెలిపారు. ఈ సమయంలో కవితకు బెయిల్ ఇవ్వవద్దని వాదించారు. బెయిల్ ఇస్తే కవితపై దర్యాప్తునకు ఆటంకం కలుగుతుందని అన్నారు. ఆమెకు బెయిల్ ఇస్తే ఆధారాలను ధ్వంసం చేస్తారని, సాక్షులను ప్రభావితం చేస్తారని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం మధ్యంతర బెయిల్‌కు సంబంధించిన తీర్పును సోమవారానికి వాయిదా వేసింది. రెగ్యులర్ బెయిల్‌కు సంబంధించి కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై ఈనెల 20న వాదనలు కొనసాగనున్నాయి.

పులిని చూసి నక్క వాతలు!

- 'కాంగ్రెస్ తెచ్చిన కరువు'పై కేసీఆర్ సమరశంఖం
- రైతుల స్పందన చూసి మేల్కొన్న బీజేపీ నేతలు
- రాష్ట్రంలో హడావుడిగా రైతుల కోసం దీక్షల నాటకం

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టు.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పోరాట విధానాన్ని కమలం పార్టీ కాపీ కొడుతున్నది. రాష్ట్రంలో అసమర్థ సాగునీటి నిర్వహణ వల్ల జరుగుతున్న పంటనష్టంపై కేసీఆర్ సమరశంఖం పూరించడం, ప్రభుత్వం, ప్రజల నుంచి స్పందన రావడంతో బీజేపీ ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ప్రభుత్వం రైతుబంధు వేయకపోయినా, సాగునీరు అందక పంటలు ఎండుతున్నా, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా స్పందించని బీజేపీ.. కేసీఆర్ పర్యటన తర్వాత మేల్కొని, రైతులపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్నది. రైతుల పక్షాన నిరసన దీక్షలు చేపడుతామంటూ ప్రకటించింది. కేసీఆర్ పర్యటనలకు సమాంతరంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నిస్తున్నది. గత నెల 31న కేసీఆర్ జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పర్యటించారు. ఎండిన పంటలు పరిశీలించి, రైతులకు భరోసా కల్పించారు. ప్రభుత్వ అసమర్థ విధానాలపై గర్జించారు. కరువు పరిస్థితులతో కొట్టుమిట్టాడుతున్న రైతులకు కేసీఆర్ పెద్ద దిక్కుగా నిలిచారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతుల నుంచి కేసీఆర్ పర్యటనకు మంచి స్పందన లభించింది. వెంటనే ప్రభుత్వం స్పందించి సాగర్ నుంచి ఎడమ కాలువకు కృష్ణా జలాలను, ఎస్సారెస్పీ నుంచి వరద కాలువకు గోదావరి జలాలను వదిలింది. వ్యవసాయశాఖ మంత్రి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు.

నాలుగు గంటలు కూడా కూర్చోలే..

కేసీఆర్ పోరాటానికి సర్కారు దిద్దుబాటు చర్యలు చేపట్టడంతో బీజేపీ రంగంలోకి దిగింది. కేసీఆర్ పర్యటిస్తున్న రోజే కొత్త నాటకానికి తెరలేపింది. రైతుల పక్షాన తాము 'దీక్ష' చేస్తామంటూ బీజేపీ ఎంపీ బండి సంజయ్ కరీంనగర్‌లో ప్రకటించారు. 2న కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో తూతూమంత్రంగా నిరసన చేపట్టారు. ఉదయం 10 గంటల తర్వాత దీక్షకు కూర్చొని.. మధ్యాహ్నం 2 గంటలకు ముగించేశారు. అంటే గట్టిగా నాలుగు గంటలు కూడా నిరసనలో కూర్చోలేదంటే బండి సంజయ్, బీజేపీ చిత్తశుద్ధి అర్థమవుతున్నదని రైతులు మండిపడుతున్నారు. కేసీఆర్ తన పర్యటనల్లో భాగంగా శుక్రవారం కరీంనగర్‌లో పర్యటించనున్నారు. దీంతో బీజేపీ మరోసారి తెరమీదికి వచ్చింది. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రాల్లో సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలిపారు. ఇది కచ్చితంగా డైవర్షన్ డ్రామా అని విశ్లేషకులు మండిపడుతున్నారు. ఇతర రోజులు వదిలిపెట్టి.. కేసీఆర్ పర్యటించే రోజునే నిరసనలు చేయడం ద్వారా ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నమని స్పష్టం చేస్తున్నారు.

అరకు లోక్‌సభ స్థానం నుంచి సీపీఎం పోటీ

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): ఏపీలోని అరకు లోక్‌సభ స్థానానికి సీపీఎం పోటీ చేస్తుందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు తెలిపారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు ఏపీ ఎప్పుడూ చూడనంత అపవిత్ర పొత్తుగా అభివర్ణించారు. కేరళ సీఎం కూతురుపై కాకతాళీయంగా దొరికిన దానిని వాడుకుని చిక్కుముడి వేసి అనుమానాలు సృష్టించడానికే ఈడీ దాడులు చేస్తుందని మండిపడ్డారు. సీపీఎంపై అవినీతి ముద్ర వేయాలని చూస్తున్నారని అన్నారు.

చంద్రబాబుకు ఎన్నికల సంఘం నోటీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): టీడీపీ అధినేత చంద్రబాబుకు ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. ఎమ్మిగనూరు, మర్కాపురం, బాపట్లలోని ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు ప్రసంగంపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్‌కుమార్ మీనాకు వైసీపీ ఫిర్యాదు చేసింది. జగన్‌పై తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేసిన బాబు ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ నేతలు లేళ్ల అప్పిరెడ్డి, మల్లాది విష్ణు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బీజేపీతో దేశం విచ్ఛిన్నం

- తుక్కుగూడ సభతో దేశానికి దిశ, దశ చూపిస్తాం
- ప్రజలకిచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం
- మీడియాతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఖమ్మం, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/బడంగ్‌పేట: కుల, మత, వర్గాల పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఓడించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ఏకైక దిక్కు కాంగ్రెస్ మాత్రమేనని చెప్పారు. గురువారం ఆయన రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న బహిరంగ సభ ప్రాంగణాన్